


వైఎస్ఆర్ కడప



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 02 ఏప్రిల్ 2026




సీఎం చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్చం అందజేస్తున్న జగన్ మోహన్ రాజు

### అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట

# శ్రీ సీతారాముల కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

శ్రీరామునికి స్వర్ణ కంకణం

సీతారాముల కల్యాణం రోజున అమరావతికి చట్ట భద్రత అదృష్టం

సీఎం చంద్రబాబు నాయుడు







అపురూపం కళ్యాణ వేదిక



సీతారాముల కళ్యాణం లో మాంగల్యాన్ని చూపుతున్న వేద పండితులు రాజేష్

**రాజంపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

శుభముహూర్తే ...సావధాన...శుభలగ్నే ...సావధాన ...శ్రీ లక్ష్మీ నారాయణ ...సావధాన ... అంటూ దక్షి ణ అయోధ్య ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేశంలో పున్నమి రాత్రి సీతారాముల కల్యాణం జరిగే ఏకైక పుణ్యక్షేత్రం ఒంటిమిట్ట. బుధవారం రాత్రి పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం సీతారాముల కళ్యాణం ఆకాశమంత పందిరిలో,అయోధ్యను తలపించిన కళ్యాణ వేదికపై లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులు కళ్యాణ క్రతువు చూసి మంత్ర ముగ్ధులయ్యారు.సాయంత్రం 6.30 గంటలకు కళ్యాణ వేడుకలు ప్రారంభమయి 8.10కు సీతమ్మ మెడలో శ్రీరామచంద్ర ప్రభు మాంగల్య ధారణ చేశారు.అంతకు ముందే కోదండ రాముణ్ణి సతీమణి భువనేశ్వరి, మనవడుతో కలసి సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు.ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా కల్యాణవేదికను అందంగా తీర్చిదిద్దారు. వేదిక రంగురంగుల పుష్పాలతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. వేదికపై, ప్రాచీన ఆలయాలలోని దశావతారాల సెట్టింగు, రామాయణంలోని ఘట్టాలతో యాక్రిలిక్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



స్వామికి యజ్ఞోపవీతం



సీతారామ కళ్యాణంకు పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

సీతారాముల కల్యాణాన్ని వీక్షి ంచేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి ముగ్ధులయ్యారు.తెలుగుదనం ఉట్టిపడేలా చెరుకులు, టెంకాయ గెలలు, టెంకాయపూత, అరటి ఆకులు, మామిడాకులు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఇందుకోసం 5 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. సాయంత్రం 5.10 కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీతారాముల కళ్యాణం కోసం విచ్చేసారు.రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒంటిమిట్ట హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది.రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి,జెఈఓ శరత్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు,ముఖ్యమంత్రికి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.టిటిడి అతిధి గృహమునకు చేరుకున్న రాష్ట్ర



ముఖ్యమంత్రి గారికి టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి బోర్డు సభ్యులు స్వాగతం పలికారు.అనంతరం 6.20 కి సీఎం సీతారాముల దర్శనం కోసం ఆలయానికి చేరుకొన్నారు.వేదపండితులు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరికి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు.ఆలయ రంగ మండపంలో ఆలయ అర్చక స్వాములు వేద ఆశీర్వచనం,ప్రసాదం,శ్రీరామ చిత్ర పటం అందజేశారు.శోభా యాత్ర రామనామ స్మరణతో ఆద్యంతం భక్తి పారవశ్యంతో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేదికపై రాత్రి 6.30 గంటలకు కళ్యాణ క్రతువుకు టిటిడి వేదపండితులు రాజేష్ బట్టర్ శ్రీకారం చుట్టారు.గణపతి పూజతో ప్రారంభమై,విశ్వక్షేణ పూజ నిర్వహించారు పుణ్యాహవచనంతో వేదికను



శ్రీ రామచంద్రునికి స్వర్ణ కంకణం

శుద్ధి చేసేందుకు పూజ నిర్వహించారు.7.08నిమిషాలకు సీఎం దంపతులు స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.స్వామికి యజ్ఞోపవీతం వేద మంత్రాలతో సమర్పించారు.టిటిడి శ్రీరామచంద్ర ప్రభుకు స్వర్ణ కంకణాన్ని అలంకరించారు. అనంతరం వేద పండితులు మహా సంకల్పం ను కల్యాణానికి వచ్చిన లక్షలాది భక్తులతో చేయించారు.





### 52 వార్డులతో రాష్ట్రంలోనే

## అతిపెద్ద మున్సిపాలిటీగా ప్రొద్దుటూరు

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 01, ప్రభాతవార్త**





ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల నియమావళి 2004ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో పురపాలక సంఘ సభ్యులను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది అందులో భాగంగా ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఇదివరకే 41 మున్సిపల్ వార్డులు ఉండగా వాటిని 52 పెంచుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద వార్డులు గల మున్సిపాలిటీగా ప్రొద్దుటూరును ప్రకటించింది. ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం మున్సిపల్ వార్డుల సంఖ్య ను నిర్ణయించింది ఏపీ పురపాలక సంఘాల నియమావళి 2004ను సవరిస్తూ పురపాలక సంఘాల ఎన్నికైన సభ్యుల సంఖ్యను ప్రకటించాలని ప్రభుత్వం సభ్యుల సంఖ్యను నిర్ధారించే అధికారాన్ని ఆంధ్రప్రదేశ్ పురపాలక పరిపాలన కమిషనర్ మరియు డైరెక్టర్ కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే అందువల్ల అప్పగించిన అధికారులను ఉపయోగించి పురపాలక పరిపాలన కమిషనర్ డైరెక్టర్ లు జనాభా ప్రాతిపదిక ఆధారంగా ఎన్నికైన సభ్యుల సంఖ్యను నిర్ణయించారు. ఇప్పటికే ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో 41 వార్డులు ఉన్నాయని మార్చి 17వ తేదీకి ఐదేళ్ల గడువు ముగియడంతో పాలక మండలి రద్దు కావడంతో మాజీ కౌన్సిలర్లుగా నిలిచారు రాష్ట్రంలోనే 52 వార్డులతో అతిపెద్ద మున్సిపాలిటీలలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఒకటి అయ్యింది మొత్తం ఐదు మున్సిపాలిటీలు తెనాలి హిందూపూర్ నంద్యాల ఆదోని పొద్దుటూరు మున్సిపాలిటీలు అత్యధిక వార్డులతో ప్రథమంగా నిలిచాయి. రాబోవు మున్సిపల్ ఎన్నికలలో 52 వార్డులకు ఇరు పార్టీల అభ్యర్థులు పోటీ చేయవలసి ఉంటుంది. ఈ పోటీలో అత్యధిక అవార్డులు ఏ పార్టీ గెలుచుకుంటుందో ఆ పార్టీ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కైవసం చేసుకుంటుంది.

### ఒంటిమిట్టలో శ్రీరామ ప్రాజెక్టుకు

## మోక్షం ఎప్పుడు?



**దండకారణ్యంలో రామతీర్థం ఆవిర్భావానికి దృశ్యరూపం ఇస్తే..**

**టిటిడి మాస్టర్ ప్లాన్ ఏమైంది?**

**రాజంపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

అయోధ్య తర్వాత ప్రధానంగా దక్షి ణ భారత దేశంలో ఒంటిమిట్ట కోదండ రామాలయానికి ఎంతో చారిత్రక, ఇతిహాస నేపథ్యం ఉంది. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు దండకారణ్యంలో( ప్రస్తుతం ఒంటిమిట్ట పుణ్యక్షేత్రం) సీతా లక్ష్మణ సమేతుడై సంచరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. దండకారణ్యం గుండా వెళుతున్నప్పుడు సీతాదేవికి దాహం వేసింది. సీతమ్మ దపిక తీర్చడానికి భూమిలోనికి శ్రీరాముడు బాణాన్ని సందించారు. దీంతో జలం ఉప్పొంగింది. అదే ఒంటిమిట్టలో రామతీర్థం అయింది.జాతీయ రహదారికి పక్కనే రామాలయానికి అతి సమీపంలోనే రామతీర్థం ఉంది. ఎటూ రామతీర్థం ఎదురుగా ఒంటిమిట్ట చెరువులో రామాలయంలో ఒకే శిలపై సీతారామ లక్ష్మణ విగ్రహాలను ప్రతిష్టించిన జాంబవంతుని 108 అడుగుల విగ్రహాన్ని20.17 కోట్ల వ్యయంతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టిస్తోంది. అదేవిధంగా కడప మార్గంలో శ్రీరాముడు రామ బాణాన్ని సందించడం వల్ల ఆవిర్భవించిన రామతీర్థం భక్తులకు పర్యాటకు, తెలిసేలా శ్రీరాముని నిలువెత్తు 108 అడుగుల విగ్రహం రామబాణం సంధించే చిత్రంగా నిర్మిస్తే పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి జాతీయ రహదారికి 20పుల దేవతామూర్తుల విగ్రహాలను ఒంటిమిట్ట రామాలయం వరకు చెరువుకట్టపై ఆలయ చరిత్ర ,చారిత్రక నేపథ్యంతో అభివృద్ధి చేస్తే అటు భక్తులను ఇటు పర్యాటకులను ఆకట్టుకుంటుంది. సహజ పాండిత్యం బొమ్మెర పోతన మాత్యులు భాగవతాన్ని ఇక్కడే శ్రీరాముడికి అంకితం ఇచ్చారు. ఆంధ్ర వాల్మీకిగా ప్రసిద్ధి చెందిన వావిలకొలను సుబ్బారావు టెంకాయ చిప్ప చేత పట్టి, భిక్షాటన చేసి శిథిలమై పోతున్న రామాలయా న్ని జీర్ణోదరణ ద్వారా పూర్వ వైభవం తెచ్చారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పై 32 వేల సంకీర్తనలు రచించి అంకితం ఇచ్చిన తొలి వాగ్గేయ కారుడు అన్నమాచార్యులు ఒంటిమిట్ట కోదండ రాముని మీద సంకీర్తన చేశారు. శ్రీరాముడు కలలో కనిపించి ఆజ్ఞాపించడంతో వంటడు, మిట్టడు అనే గజదొంగలు ఒంటిమిట్ట రాలమాలయాన్ని అభివృద్ధి చేశారు. ఇలాంటి చారిత్రిక పురాణ నేపథ్యాలతో రామాలయం ఎదురుగా ఉన్న వావిలను సుబ్బారావు గుట్టపై శ్రీరామ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు 2015లో రామాలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రభుత్వం విలీనం చేసిన తర్వాత మాస్టర్ ప్లాన్ లో భాగంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శ్రీ రామ ప్రాజెక్టు తో పాటు రామాలయాన్ని చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి చేసేందుకు టిటిడి తాజాగా సిద్ధం చేసే బాధ్యతను భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన ఓ కన్సల్టెన్సీ సంస్థకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ నివేదిక ముఖ్యమంత్రికి చంద్రబాబు నాయుడుకు త్వరలో అప్పగించడం జరుగుతుందని సమాచారం. దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా ఒంటిమిట్ట రామాలయాన్ని నా భూతో నభవిష్యత్తు అన్న చందంగా అభివృద్ధి చేసే బాధ్యత కూడా కూటమి ప్రభుత్వ అధినేత సీఎం చంద్రబాబుపై ఉంది.



# ప్రభుత్వం ఉపాధ్యాయులు ఉద్యోగులను విస్మరిస్తే ఉద్యమమే

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్ హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏలను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. .ఏపీ జెఏసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారపక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు.




ప్రతిపక్ష హోదాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చిన కూటమి పెద్దలు గద్దెనెక్కగానే ఉద్యోగుల సమస్యలను విస్మరించడం ఏంటని ప్రశ్నించారు. సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.మనోహర్, ఎల్ఐసి డివిజన్ కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు బి.రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం సాగిస్తున్న యుటిఎఫ్ దీక్షలకు తాము పూర్తి సంఘీభావం, మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శైలేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, ఏపీ ఎన్జీవో నాయకులు కె.చిన్నయ్య, పద్మనాభరావు యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలి




కడప కార్పొరేషన్ ఏప్రిల్ 1 ప్రభాతవార్త:

రాష్ట్రంలో 1.40 కోట్లకుపైగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆపద్బాంధవి అయిన ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయనీ వైసిపి వైద్య విభాగం కడప జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జున్ రెడ్డి అన్నారు. టిడిపి ప్రభుత్వం రూ.3 వేల 200 కోట్ల బకాయిలు చెల్లించలేదని దుయ్యబుట్టారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. బుధవారం కడప వైసీపీ కార్యాలయంలో విలేకరులతో డాక్టర్ నాగార్జున్ రెడ్డి మాట్లాడుతూ నెట్వర్క్ ఆస్పత్రులకు చంద్రబాబు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రెండేళ్ల తిరక్కుండానే ఆస్పత్రుల యాజమాన్యాలు మూడోసారి సమ్మె బాట పట్టాయన్నారు. నెట్వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.3 వేల కోట్లు బకాయి పడిందనీ తెలిపారు. పేరుకుపోతున్న బకాయిలతో ఆస్పత్రుల మనుగడ కష్టతరం అవుతోందని కొద్ది నెలలుగా ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశ) ఆందోళన వ్యక్తం చేస్తోందనీ.. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో బకాయిలు తీర్చకపోతే ఏప్రిల్ 1వ తేదీ (బుధవారం) నుంచి సేవలు నిలిపేసి, సమ్మెలోకి వెళతామని వారం కిందటే ఆశ అల్టిమేటం జారీ చేసిందనీ చెప్పారు. వారితో చర్చలు జరిపి, సేవలు నిలవకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించింది. వెరసి పేద, మధ్య తరగతి ప్రజల ఉచిత వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితులు రాష్ట్రంలో తలెత్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్రప్రసాద్, చల్ల పవన్ కుమార్ పాల్గొన్నారు.

# జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా సింగసాని రవీంద్రనాథ్



బద్వేలు అర్బన్ ఏప్రిల్ 01 ప్రభాతవార్త :

కడప జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్గా ఇటీవల ఎన్నికైన సింగసాని రవీంద్రనాద్‌కు బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి చెల్లుబోయిన గంగన్న యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ గంజికుంట పుల్లయ్య సలహాదారులు గడి పుల్లంరాజు, ఎస్ ధనుంజయరావు, ఉపాధ్యక్షులు చెప్పలి వెంకటేశ్వర్లు, కాడి ఆనందరావు, అన్నపురెడ్డి లక్ష్మిరెడ్డి, సి వి ప్రసాద్, రామ సుబ్బయ్య, ఎస్ సుందరరాణి, వాకమల్ల రాఘవరెడ్డి,, ముల్లపాటి పిచ్చయ్య, సంయుక్త కార్యదర్శి తోట చెన్నారాయుడు, ప్రకారామయ్య హేమలత, ఉప కోశాధికారి కొప్పు శ్రీరాములు తోపాటు పలువురు ఆధ్వర్యంలో జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ సింగసాని రవీంద్రనాథ్‌ను సత్కరించి వారి సేవలను అభినందించారు, ఈ సందర్భంగా అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, గంగన్న మాట్లాడుతూ సింగసాని రవీంద్రనాథ్ పెన్షనర్స్ సంఘంలో ఉంటూ కడప జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్గా నియమితులు కావడం సంతోషకరమన్నారు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నిరంతరాయంగా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు, భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో ఇటువంటి పదవులు మరెన్నో అలంకరించాలని అనంతరం వారి సేవలను పలువురు కొనియాడారు అనంతరం జిల్లా పెన్షనర్స్ సంఘం వైస్ ప్రెసిడెంట్ సంగసాని రవీంద్రనాథ్ మాట్లాడుతూ పించనర్స్ సంఘం సభ్యులు అందరి సమిష్టి కృషితో తమను జిల్లా వైస్ ప్రెసిడెంట్గా నియమించడం సంతోషకరమన్నారు, పించనర్స్ సమస్యల పట్ల ఎప్పటికీ అందుబాటులో ఉంటూ శక్తి వంచనా లేకుండా కృషి చేస్తామని తమను కార్యాలయానికి ఆహ్వానించి ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోష కరమని వారు పలువురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, మీ ప్రేమ ఆప్యాయత మాపై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కుల గణన చేపట్టాలి

బద్వేలు, ఏప్రిల్1, ప్రభాతవార్త




రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలకు ముందే కుల గణన నిర్వహించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. తెలంగాణ, బీహార్ రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కుల గణన చేపట్టాలని ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ కోరారు. బుధవారం బద్వేలు పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌లో పార్టీ కార్యాలయంలో రామరాజు అధ్యక్షతన బీసీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థలలో వార్డ్ మెంబర్, సర్పంచ్, ఎంపిటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్, చైర్మన్, కార్పొరేటర్, మేయర్ వంటి పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టసభల్లో మహిళలకు, యువతకు రిజర్వేషన్లు పెంచాలన్నారు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీసీ సంఘాలన్నింటినీ కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. జకరయ్య, బి. అనిల్, ఏరియా నాయకులు బాబు, జయరామరాజు, చంద్రపాల్, నారాయణ, పట్టణ నాయకులు రంతూ బాషా, గుర్రప్ప, శ్రీను, మహబూబ్ బాషా, దైవదినం, సలీం తదితరులు పాల్గొన్నారు.

## నందలూరులో పింఛన్ల పంపిణీ

నందలూరు, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:



మండలంలోని నందలూరు పంచాయతీ మసీద్ వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతోందని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బార్ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ



నందలూరు, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:

నందలూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు చేపట్టారు. అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్ అలీ, ఉపాధ్యక్షుడిగా గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, కార్యదర్శిగా నాయనపల్లి అనుదీప్ జయసింహ, సహాయ కార్యదర్శిగా నూర్ అహమ్మద్, లైబ్రరీ సెక్రటరీగా సుబ్రమణ్యం, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎం.ఎన్. విజయసింహ, ఖజాంచీగా నళిని, లేడీ ప్రతినిధిగా స్వేచ్ఛ బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనందకుమార్, రవి, ఏ.వి. సుబ్రమణ్యం, మాజీ బార్ అధ్యక్షుడు డి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

బద్వేలు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త



మున్సిపాలిటీలోని భావనారాయణ నగరలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ కే. రితేష్ కుమార్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, బి.కోడూరు మండల పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, బద్వేల్ మండల పార్టీ అధ్యక్షులు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఎల్ఎస్పి చైర్మన్ రమణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ బిజీ వేముల రామచంద్రారెడ్డి, ప్రహ్లాద, శంకర్ రెడ్డి, రామయ్య, పెద్దన్న, కేశవ, స్కూల్ చైర్మన్ శ్రీనివాసులు, చిన్న స్టూడియో, శివ, అమర్నాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కోక్లస్టర్ ఇంచార్జ్ మన్యం రామిరెడ్డి, సుబ్బరామయ్య నాయకులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వాహనదారుడు మృతి

ముద్దనూరు ఏప్రిల్. 01 ప్రభాతవార్త;

మండల పరిధిలోని ఆరవేటి పల్లె గ్రామానికి చెందిన గొల్లకొండ చంద్రశేఖర్ భార్య పుట్టింటికి వెళుతూ ఆదివారం అర్ధరాత్రి మండలంలోని నల్లబల్లె వంక సమీపంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు కింద పడి తలకు కాళ్లకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు కర్నూలు పట్టణంలోని వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఏడాది క్రితమే వివాహం కాగా బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండగా భార్య ఎనిమిది నెలల గర్భవతి కావడంతో కుటుంబ సభ్యులలో, గ్రామస్తులు కన్నీటి పర్వతమయ్యారు. మృతుని భార్య సారే నాగజ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చాపాడు, ఎంపీడీఓగా మధుసూదన్

చాపాడు. ఏప్రిల్ 1.ప్రభాతవార్త :

చాపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం,ఎస్. మధుసూదన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత కొద్దిరోజులుగాఖాజీపేట ఎంపీడీవో దివిజాసంపతి ఇన్చార్జ్ ఎంపీడీవో (ఎఫ్,ఎ,సి)గావిధులు నిర్వహిస్తున్నారు. కడపజిల్లా పరిషత్ నందు అడ్మినిస్ట్రేషన్ అధికారిగాపనిచేయుచు పదోన్నతిపైచాపాడు ఎంపీడీవోగా నియమితులయినట్లు ఆయనతెలిపారు. ఈ సందర్భంగాప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందించి మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 01 ప్రభాతవార్త :

బ్రహ్మంగారిమఠం ఐసిడిసి సెక్టర్ పరిధిలోని మండల పరిధిలో నరసన్న పల్లె హెచ్ డబ్ల్యు అంగన్వాడి సహాయకురాలు ఆయా పోస్ట్ 1 ఓసి ఈ పోస్టుకు ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. గోడ్లవీడు అంగన్వాడి సహాయకురాలు పోస్టు 1 ఎస్సీ మాదిగ. పూండ్ల చెన్ను పల్లి అంగన్వాడి సహాయకురాలు పోస్టు 1 ఎస్టి. పైన తెలిపిన ఖాళీలు భర్తీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారము భర్తీ చేయబడునని తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు పదవ తరగతి తప్పనిసరిగా పాసై ఉండవలెను. దరఖాస్తు చేయు తేదీ నాటికి 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరం లోపు ఉండవలెను. 13 వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు చాపాడులోని ఐసిడిఎస్ కార్యాలయం నందు స్వీకరించబడునని చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ముంతాజ్ బేగం తెలియజేశారు.

## పింఛన్ పంపిణీలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు

మైదుకూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త;



మైదుకూరు మున్సిపాలిటీ పట్టణ ఎన్టీఆర్ పించని పంపిణీలో మార్చి 1వ తేదీన బుధవారం ఉదయం 7 గంటలకు పింఛన్ పంపిణి చేశారు. నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు 14వ వార్డు నందు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ మరియు మైదుకూరు పట్టణ అధ్యక్షులు దాసరి బాబు (అడ్వకేట్) ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో కలిసి పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు పాలమాబు, లాలయ్య, డీలర్ పందిటి సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ట్రైన్ నుంచి జారి వ్యక్తికి స్వల్ప గాయాలు

నందలూరు, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:

రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఓ వ్యక్తి ట్రైన్ నుంచి జారి గాయాలతో బయటపడ్డాడు. జమ్ములమడుగు ప్రాంతానికి చెందిన నాగరాజు దాదర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడినట్లు సమాచారం. ఘటనలో అతనికి స్వల్ప గాయాలే కాగా, స్థానికులు వెంటనే స్పందించి సహాయం అందించారు. అనంతరం అతడిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

## పింఛన్ పంపిణీలో కోన సుబ్బారావు



మైదుకూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:

నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మైదుకూరు మున్సిపాలిటీ 4వ వార్డు చౌడేశ్వరి నగర్‌లో నందు బుధవారం మార్చి 1వ తేది ఖీఎన్టీఆర్ భరోసాఖీ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కోన సుబ్బారావు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేయడం జరిగింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడటమే మా లక్ష్యం అని ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, వితంతువులు మరియు దివ్యాంగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వే ఈ పథకం యొక్క నిజమైన విజయం అని తెలుగుదేశం పార్టీ నాయకులు కోనా సుబ్బారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా సుండుపల్లెను చేయాలి

సుండుపల్లె, ఏప్రిల్ 01,ప్రభాతవార్త :

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ కుల గణన జరుగుతున్న నేపథ్యంలో కుల గణన అనంతరం రాష్ట్రంలో అనేక ఎంపీ సీట్లు అసెంబ్లీ సీట్లు పెరుగుతున్నాయి కావున సుండుపల్లె ను అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని సుండుపల్లె బిజెపి మండల అధ్యక్షుడు రమణగౌడ్ ఎన్డిఎ ప్రభుత్వాన్ని కోరారు. సుండుపల్లె చుట్టుపక్కల ఉండే వీరబల్లి మండలం,కె.వి పల్లి మండలం,ఎర్ర వారి పాలెం మండలం ఈ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు.అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా సుండుపల్లి మండలం నుండి వీరబల్లి మండలానికి 25 కిలోమీటర్లు కేవీ పల్లి మండలానికి 25 కిలోమీటర్లు ఎర్ర వారి పాలెం నకు 37 కిలోమీటర్లు దూరము కలిగి ఉంది భౌగోళికంగా అన్ని మండలాలకు అనుకూలంగా ఉండే ప్రాంతం సుండుపల్లి మండలం అదేవిధంగా సుండుపల్లి మండలం నందు సర్కిల్ ఆఫీసు ఐసిడిసి ఆఫీసు వెలుగు ఆఫీసు మరియు తదితర ఆఫీస్ ప్రభుత్వ కార్యాలలో భవనములు నిర్మించుకునేందుకు తగు ప్రభుత్వ భూములు ఉన్నాయి కావున అధిష్టానవారు ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా నియోజకవర్గ అభివృద్ధికై సుండుపల్లి అసెంబ్లీ కేంద్రం చేయాలని కోరుతున్నాము.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

సిద్దవటం ఏప్రిల్1 ప్రభాతవార్త



మండలం మాధవరం గ్రామపంచాయతీ మాధవరం గ్రామంలో బుధవారం తెల్లవారక ముందే పేదలకు ఎన్టీఆర్ వితంతు వికలాంగులు పింఛన్ భరోసా కార్యక్రమంలో రాష్ట్ర స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడ లేని విధంగా వికలాంగులకు 6000, డయాలసిస్ పేషెంట్లకు 10000, వితంతువులకు 4000 పంచడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి నాగూర్ బషీర్ భాష, బూత్ కన్వీనర్, మాల రామకృష్ణ, షేక్ ఖాదర్ బాషా, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లెలో అన్నదాన కార్యక్రమం

సిద్దవటం ఏప్రిల్ 1 ప్రభాతవార్త



మండలం ఉప్పరపల్లె గ్రామపంచాయతీ ఉప్పరపల్లి గ్రామంలో రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు బుధవారం మధ్యాహ్నం రాజంపేట తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ నివాసం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించడం జరిగింది. చామర్తి మాట్లాడుతూ శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని, భక్తులకు ఇలా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. స్థానిక నాయకులు రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, సింగల్ విండో అధ్యక్షులు దారపునేని దశరథ రామానాయుడు నిత్యపూజ స్వామి దేవస్థానం చైర్మన్ రాజేంద్రప్రసాద్ యాదవ్ వేణు గోపాల్, బషీర్, స్థానిక నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటం ఆగదు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త



పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగం నందు ఔట్సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తున్న బి వెంకటేశ్వర్లను అన్యాయముగా విధుల నుండి తొలగించిన విషయమై గత 20 రోజులుగా నిరసనలు, రిలే నిరాహార దీక్షలు సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టారు. అయినా విధుల్లోకి తీసుకోకపోవడంతో బుధవారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఇచ్చిన ఉత్తర్వులను పునః పరిశీలించి అతడిని విధులలోకి తీసుకోవాలని చెప్పి పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌ని, జిల్లా కలెక్టర్‌ని, జాయింట్ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్‌ని , అలాగే రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ని కలిసి విన్నవించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ని కూడా బాధితుడికి జరిగిన అన్యాయం గురించి వివరించి అతడికి న్యాయం చేయాలని కోరారు. బాధితుడికి మద్దతుగా విధిలేని పరిస్థితులలో మున్సిపల్ కార్మికులు తమ విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. అధికారుల స్పందన లేనందున సమస్య తీవ్రత ఉన్నతాధికారులకు తెలియజేయుటకు బాధితుడు బి వెంకటేశ్వర్లు, వీరికి మద్దతుగా సిఐటియు ఇంజనీరింగ్ సెక్షన్ ప్రధాన కార్యదర్శి సి భాస్కర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఆఫీసు నుండి గాంధీ రోడ్డు లోని గాంధీ విగ్రహం వద్దకు కార్మికులందరూ కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వచ్చి దీక్ష శిబిరం వద్ద ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులందరూ ఏకతాటిపైకి రావడం సంతోషకరమ తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకులు సాల్మన్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు మరియు నాయకులు గంగాధర్ రెడ్డి భాస్కర్ శివప్రసాద్ జాషువా ఓలమ్మ వెంకటేష్ సుబ్బయ్య పాల్గొన్నారు వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సిఐటియు ప్రధాన కార్యదర్శి కొరపాటి సత్యం, ఇంజనీరింగ్ సెక్షన్ బి విజయకుమార్, శానిటేషన్ వర్కర్స్ నాయకులు సాల్మన్, రాఘవ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు డేవిడ్ ఇతరులు పాల్గొన్నారు.

# సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు వరం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు వరం లాంటిదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27 వ వార్డులో బుధవారం జిల్లా పార్లమెంట్ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్లు అందించి లబ్ధిదారుల అవసరాలు తీర్చుకునే వెసలుబాటు కల్పిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.యస్ జబిబుల్లా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, టీఎస్టీయుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు, బచ్చల ప్రతాప్, భూమిరెడ్డి సూర్యప్రతాప్ రెడ్డి, కామిశెట్టి బాబు పగిడాల దస్తగిరి రిటైర్డ్ ఎస్పై శివశంకర్ బిజెపి పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, మాజీ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, జిలాన్, కమాల్ బాషా, సాలన్న, జింకా రామకృష్ణ, తలారి రమేష్, డీలర్ కాచన శ్రీనివాసుల రెడ్డి, వార్డు నాయకులు తలారి మట్టేసు, మోష, జాషువ, తలారి ఓబులేసు, పెద్దన్న, రంగడు, తలారి సన్నీ, చిన్న, శ్రీకాంత్, శివారెడ్డి, బాలుడు, తన్ని, చరస్థి రాస్తులను, ధనరాజ్, ప్రవీణ్, మణి, దినకర్,కుమార్ బద్వేలు రవి, పల్లేటి రాముడు, పగిడాల సుబ్బారెడ్డి, నూరి, మార్తల గురివి రెడ్డి, నాగేంద్ర, కామిశెట్టి బాబు, మోడంపల్లె రవి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులకు నిర్ణీత ధరలకే ఎరువుల విక్రయం

దువ్వూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:



దువ్వూరు ప్రాథమిక సహకార సంఘం నందు ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణిత ధరలకే రసాయనిక ఎరువులను విక్రయిస్తున్నామని సంఘం చైర్మన్ రెడ్డి, మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం నందు రసాయనిక ఎరువుల విక్రయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ ధరలకే ఎరువులు అందించేందుకు దువ్వూరు ప్రాథమిక సహకార సంఘం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం సహకార సంఘం నందు 500 బస్తాలు యూరియా ఉందని వీటిని ప్రభుత్వం నిర్ణయించిన ధర 266.75 పైసలకే విక్రయిస్తున్నామని, అవసరమైన రైతులు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామ్మోహన్, టౌన్ ఇన్చార్జ్ రాంబాబు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎంయుఏ యూనియన్‌లోకి చేరికలు,

మైదుకూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:

మైదుకూరు పట్టణ కడప రోడ్డు మేధా డిఫెన్స్ అకాడమీ నందు ఎన్ఎంయుఏ డిపో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి సుబ్బరాయుడు అధ్యక్షత వహించారు. ఎన్ఎంయుఏ రాష్ట్ర నాయకత్వం ఉద్యోగస్తుల కోసం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి శివారెడ్డి ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ నుండి 15 మంది ఎన్ఎంయుఏలోనికి చేరడం జరిగింది. యూనియన్‌లో చేరిన వారందరికీ పూలదండలను వేసి అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ శంకర్, భాస్కర్ రెడ్డి, సిసిఎస్ డెలికేట్ నరసింహులు, జిసిఎస్‌రెడ్డి, జిహెచ్ఎన్ రెడ్డి, నాగరాజు, కేజే కుమార్, అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



## గాయపడిన వ్యకిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:

మండలంలోని నల్లయ్యగారిపల్లె గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి తమ్మునికి ఇటీవల పటాకాయలు పేలుస్తుండడంతో చెయ్యికి గాయం అయ్యింది. ఈ మేరకు ఆయన్ను ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బాలయ్య, పాతసంగటిపల్లి ఎంపిటీసీ నాగమల్లారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పెండ్లిమర్రి సర్పంచ్ నాగమల్లారెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, గుర్రప్ప, కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కర్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PASSPORT MISSING

Shaik Sartaj W/O, Shaik Mohammad Ali, D/no: 2/25, Dinnepadu ( Vi),Lakki Reddy palli (M) Annamayya (Dist) A.P., I lost my original Passport NO: R9312584, anybody findouting pl inform the above address and my cell No:9390625021

# ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్యం స్థాపన

### సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడుజై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన కళ్యాణ వేదిక

### శ్రీరాముడు, శ్రీవారి అనుగ్రహంతో ప్రజా రాజధానిగా అమరావతి

**రాజంపేట, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



మంచి పరిపాలన అంటే రామరాజ్యం గుర్తుకొస్తుందని, పవిత్రమైన సీతా రాముల కళ్యాణం రోజున ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత రావడం ఎంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి సన్నిధిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన శ్రీ సీతారాముల దివ్య కళ్యాణోత్సవం అనంతరం కళ్యాణ వేదిక వద్ద భక్తులను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.జై శ్రీరామ్ నినాదాలతో ముఖ్యమంత్రి వేదికపై తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఒంటిమిట్ట శ్రీరాముడు మరియు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్యం స్థాపన జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్టలోని ప్రాచీన శ్రీ కోదండరామాలయాన్ని టీటీడీ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసే బిల్లుకు ఆమోదం లభించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, దేవేంద్రుడు పాలించిన దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజల రాజధానిని అభివృద్ధి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం శ్రీరాముడు, శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. కళ్యాణ వేదిక వద్ద భారీగా తరలివచ్చిన భక్తజన సమూహం మధ్య జై శ్రీరామ్ నినాదాలు మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని అనుసరించి ధర్మపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాముడు పేరు వినగానే గుర్తొచ్చేది రామరాజ్యం.. సుపరిపాలన అని వ్యాఖ్యానించారు. ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ పండితులు స్వామి వార్ల చిత్రపటాన్ని అందించి ప్రసాదాలను అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు.

# ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు నిర్వహించకపోవడం దురదృష్టకరం

### పాలకుంట శ్రీనివాసులు

**పీలేరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త:**



పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో చాలాకాలంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు మరియు పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించకపోవడంపై చాలా బాధాకర విషయం అని తహసిల్దార్ల తీరుపై జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ఎస్సీ ,ఎస్టీ ప్రజల అభివృద్ధి కొరకు మరియు అట్రాసిటీ నివారణ కొరకు ప్రతినెల మండల స్థాయిలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం తో పాటు ప్రతి నెల చివరివారం ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) మండల స్థాయి అధికారులతో తహసిల్దార్ అధ్యక్షతన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్న పాటించకుండా కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ తుంగలో తొక్కుతూ పీలేరు నియోజకవర్గంలోని తహసిల్దార్లు ఎస్సీ ,ఎస్టీ ల పట్ల వివక్షత చూపుతూ సమస్యలను తమదైన శైలిలో గాలికి వదిలేస్తూ మరోపక్క ఎస్సీ ,ఎస్టీ సమస్యలను తూచా తప్పకుండా పరిష్కరిస్తామని హంగు ఆర్భాటాలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తూతూ మంత్రంగా ఎస్సీ, ఎస్టీ సమస్యల పట్ల ఎనలేని శ్రద్ధ కనబరుస్తున్నట్టు పీలేరు నియోజకవర్గంలోని రెవెన్యూ శాఖ అధికారులకు వెన్నతో పెట్టిన విద్యగా భావించవచ్చని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో చాలా మండలాల్లో మండల స్థాయి అధికారులు ఈ సమావేశాలకు చాలావరకు హాజరు కాకుండా వివక్షత ప్రదర్శించడం అట్రాసిటీగా భావిస్తున్నామని హాజరుకాని అధికారులపై సెక్షన్ 4 కింద కేసు నమోదుకు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని మరియు జస్టిస్ పున్నయ్య కమిషన్ మేరకు నిర్వహించాల్సిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు మరియు ప్రతి నెల చివరిలో నిర్వహించాల్సిన పౌర హక్కుల దినోత్సవాలను నిబంధనల మేరకు నిర్వహించకుండా వారి ఇష్టానుసారం సమావేశాల పట్ల వారు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమావేశాలు నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకోవాలని పాలకుంట శ్రీనివాసులు కోరారు.

# అమరావతి రాజధానిగా లోకసభ చట్టబద్ధత ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి మైలురాయి

### రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

అమరావతి రాజధానిగా లోక్సభలో చట్టబద్ధత కల్పించి పునర్ నిర్మాణానికి సహకరిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం మేరకు లోకసభ చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారికి రాష్ట్ర ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదల మరియు అహర్నిశ కృషి వలన ఈ సాధన సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల ఆశలు నెరవేరేలా ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ, రైతుల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అమరావతి కోసం దీర్ఘకాలంగా పోరాడి విజయం సాధించిన రైతులందరికీ హృదయపూర్వక అభినందనలు. వారి త్యాగం, పట్టుదల వల్లే ఈ చారిత్రాత్మక ఘట్టం సాకారం అయిందని పేర్కొన్నారు.

2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అమల్లోకి రానుండటం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను, ప్రస్తుత ప్రభుత్వం "ఒకే రాజధాని – సమగ్ర అభివృద్ధి" అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కట్టుబడి ఉంది. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం అమోహం అన్నారు.ఇకపై ఎవరూ ఒక్క ఇంచు కూడా అమరావతిని కదిలించలేరని ఆయన పునరుద్ఘాటించారు.

# గడప గడపకు సిపిఐ

# ప్రజా ఉద్యమాల విరాళాల సేకరణ




**పులివెందుల, ఏప్రిల్ 1 , ప్రభాతవార్త :**

గడప గడపకు సిపిఐ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాల కోసం విరాళాల సేకరణ చేపట్టామని ప్రజలంతా ఇతోధికంగా సహకరించాలని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు పేర్కొన్నారు. సోమవారం బుధవారం పులివెందులలోని ప్రధాన వీధుల్లో షాప్ టు షాప్ గడపగడపకు సిపిఐ విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాల విరాళాల సేకరణ" కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు, అక్రమాలపై ఉద్యమాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, బలహీన వర్గాల పై దాడులు, ఆకాశానంటుతున్న ధరలు, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలపై పోరాటాలు కొనసాగించేందుకు ప్రజల నుండి స్వచ్ఛంద విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజలే ఉద్యమాల బలం అని, చిన్న మొత్తమైనా విరాళంగా ఇచ్చి ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రజా ఉద్యమాలు ప్రజల డబ్బుతోనే నడుస్తాయన్నారు. భూ ఆక్రమణలపై పోరాటం,కార్మిక, కర్షక, రైతు, బహుజనల హక్కుల పరిరక్షణ, యువత ఉపాధి – నిరుద్యోగంపై ఉద్యమం, ధరల పెరుగుదల, ప్రజా సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేక పోరాటాలకు పారదర్శకంగా విరాళాల వినియోగం చేపడుతామన్నారు. స్వాతంత్రోద్యమ చరిత్ర కలిగిన సిపిఐ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీగా ప్రజాశక్తిగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల ప్రజానీకం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పులివెందుల పట్టణ నాయకులు సుభాన్ భాష, వేముల మండల కార్యదర్శి చాంద్ బాషా, బాదుల్లా నరేంద్ర , తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల గొడవ ..... వ్యక్తి ఆత్మహత్య

**పులివెందుల, ఏప్రిల్ 1 , ప్రభాత వార్త :**

పులివెందుల పట్టణంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ దారుణానికి దారి తీసింది. స్థానికంగా వైయస్ వి ఆర్ ఎం బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో నివాసముంటున్న గర్లకంఠారెడ్డి దంపతుల మధ్య ఇటీవల వివాదం చెలరేగింది.ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన భర్త గర్లకంఠారెడ్డి, తన భార్య అనురాధపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అనురాధ కుడివైపు దవడకు గాయమైంది. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో భయపడిన గర్లకంఠారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# ఎన్టీఆర్ పెన్షన్‌లు లబ్ధిదారులకు కొండంత బరోసా

**సుండుపల్లి,ఏప్రిల్ 01,ప్రభాతవార్త :**



మండల పరిధిలోని చెన్నంశెట్టిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమ టిడిపి మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ లబ్ధిదారులకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విఆర్ఓ వెంకటరమణ, విఆర్ఎ రామచంద్ర,సుబ్బారామయ్య శ్రీనివాసులు నాయుడు, జొన్నల అరుణ్ కుమార్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు పంచాయతీ వేలం పాటలు

**దువ్వూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన బస్ స్టాండ్, మార్కెట్ అలాగే పంచాయతీకి సంబంధించిన రూములను ఏడాది పాటు వేలం వేస్తున్నట్లు సర్పంచ్ చంద్రాయుడు, ఈఓపీఆర్డీ హరికృష్ణలు తెలిపారు. 2026, 27వ సంవత్సరానికి సంబంధించి ఈ వేలంపాటలు నిర్వహిస్తున్నామన్నారు. వేలంపాటలో ముందుగా డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వేలం పాటలు మొదలవుతాయన్నారు. వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.

# హనుమంత వాహనంపైన స్వామి వారు



**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 01 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణ పరిధి చెన్నంపల్లి గ్రామంలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆది చెన్నకేశవ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ వారం తెల్లవారుజామున రమేష్ శర్మ వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు, ప్రత్యేక ఉభయ దాతలుగా కీర్తిశేషులు నపగా చెన్నారెడ్డి సతీమణి వెంకటసుబ్బమ్మ, కీర్తిశేషులు పంగా రామ సుబ్బారెడ్డి సతీమణి జయమ్మ కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు, అనంతరం రాత్రి మాడవీధులలో హనుమంత వాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు దేవాదాయ శాఖ ఈవో రామలింగారెడ్డి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నపగా చెన్న కృష్ణా రెడ్డి, లోకముల సుధాకర్ రెడ్డి వా కమల రాఘవరెడ్డి, వాకమల శివరామిరెడ్డి, బాల నరసింహారెడ్డి, కొనిరెడ్డి హనుమంతు రెడ్డి, నపగా రవీంద్రారెడ్డి మరియు పలువురు కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సాయి చైతన్య ఆలయ సిబ్బంది కొండయ్య సాంబయ్య రాజు పలువురు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# సర్పంచ్ ల సేవలు అభినందనీయం

**వేంపల్లె ఏప్రిల్ 01 (ప్రభాత వార్త)**

మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల సేవలు అభినందనీయమని జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి కొనియాడారు. ఏప్రిల్ 2వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియనున్న సందర్భంగా వారిని ఘనంగా సత్కరించడం జరిగింది. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని వైఎస్సార్ సభాభవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను శాలువాలు కప్పి, పూలదండలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో వారు చూపిన కృషి ప్రశంసనీయమని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో గ్రామాల రూపురేఖలు మారేలా అభివృద్ధి పనులు చేపట్టారని, పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు వారు నిరంతరం శ్రమించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో ముందుండాలని, తమ అనుభవంతో గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని సర్పంచులను అభినందించారు.




# " మీ సేవలు అమోఘం - అందుకోండి మా సన్మానం "

### సర్పంచులకు ఘన వీడ్కోలు

**చౌడేపల్లి, ఏప్రిల్ 1 : ప్రభాతవార్త**



సన్మానమందుకొంటున్న సర్పంచులు

పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మీ అందరికీ ఇదే మా సన్మానమంటూ వైకాపా శ్రేణులు మండలంలోని సర్పంచులకు ఘన సన్మానంతో వీడ్కోలు పలికారు. సర్పంచుల పదవీ కాలం ముగియనున్నడంతో మండలంలోని 18సర్పంచులను స్థానిక వైకాపా పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజలందరికీ అందుబాటులో వుండి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేసారు. పదువులకే అలంకరణ తీసుకొచ్చి అందరి మన్నలనూ చూరగొన్నారన్నారు. ఇంతటితో ఆగకుండా ప్రజలకు మరింతగా దగ్గరయ్యేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. సర్పంచులుగా కాకుండా అందరిలో ఒకరిలా మనుగడ సాధించిన వారందరికీ మరిన్ని పదవులు లభిస్తాయన్నారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు ఈ సందర్భంగా మండలంలోని 12మంది మహిళా సర్పంచులకు చీర, సారెనందించారు. వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, ఎంపిపి గాజుల రామ్మూర్తి, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, వైకాపా విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ తదితరులు సర్పంచులను ఘనంగా సన్మానించారు. సర్పంచులుగా పంచాయతీల్లో తాము చేసిన సేవలను వారు గుర్తు చేసుకొన్నారు. వైకాపా నాయకులు జంగాలపల్లి రమణ, పవన్‌రాయల్, గ్రెంధెం మంజునాథ్, తొండా శ్రీరాములు, అనుప్రియ పలువురు నాయకులు, కార్యకర్తలు, మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి ఒక రైతు పాటించాలి

**రాయచోటి ఏప్రిల్ 1 ప్రభాతవార్త**




ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతు పాటించాలని జిల్లా గ్రామీణ ప్రకృతి వ్యవసాయ సమస్త ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్ తెలిపారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కి రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం యల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని లక్ష్యంగా చేసుకొని రాయచోటి పాత కలెక్టరేట్ కార్యాలయంలో మూడు రోజుల సమన్వయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించబడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే ఎండాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతు వద్దకు చేర్చేలా తీళిది సెంటర్లు ప్రతి మండల పరిధి లో ఉంచి ప్రతి రైతులకు అందుబాటులో ఉంచే విదంగా సీడ్ కిట్స్ మరియు , ద్రావనాలు,కసాయలు రెడీ చేసుకొని అందుబాటులో ఉండే విదంగా క్రింద స్థాయి సిబ్బంది అధికారులు కృషి చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు మహమ్మద్ మజీద్ మాట్లాడుతూ, యల్ నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితుల నేపథ్యంలో రైతుల ఆదాయం స్థిరంగా ఉండేందుకు వివిధ మోడళ్లను గ్రామస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. పీఎండీఎస్ ద్వారా విత్తనాలను మట్టి గుళికలుగా తయారు చేసి భూమిలో విత్తడం, ద్రవ జీవామృతం వినియోగించడం ద్వారా పంటల నిలకడ పెరగడంతో పాటు పశుగ్రాసం సమృద్ధిగా లభించేలా శిక్షణలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే వేరుశనగ, కంది, మామిడి, ఆకుకూరలు వంటి పంటల అనుసంధాన పద్ధతులను ప్రోత్సహిస్తూ విత్తన కిట్లను కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. శిక్షణలో అగ్రికల్చర్,అధికారులు మరియు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# మిల్లెట్ ప్రాసెసింగ్మం యూనిట్‌ను పరిశీలించిన పీడీ



**చిన్నమండెం ఏప్రిల్ 1 ప్రబాత వార్త:**

మండలంలోని ,చిన్నర్సుపల్లి గ్రామంలో లో ఉన్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ను బుధవారం పీడీ నాగేశ్వరరావు పరిశీలించారు.పీ యం ఎఫ్ యం ఇ స్కీమ్ ద్వారా ఈ యూనిట్ నీ ఏర్పాటు చేశారు , ఈ మిల్లెట్స్ నీ శైలజ అనే సభ్యురాలు సొంతంగా పండించి ఇక్కడే ప్రాసెస్ చేసి ఈ మిల్లెట్స్ ను వేరే మండలాలకు మరియు వేరే జిల్లాలకు అమ్మడం ద్వారా మంచి ఆదాయం ఆ సభ్యురాలికి లభిస్తుంది . రాగులు , కొర్రలు , సజ్జలు , అరికలు , ఇలా అన్ని పండించి ప్రాసెసింగ్ చేసి అమ్ముతున్నారు . ఈ ప్రోగ్రామ్‌కి గంగార్జున, ఏపీఎం రెడ్డెమ్మ , సీసీ లు , వీ ఓ ఏ సిబ్బంది పాల్గొన్నారు.

# అండగా ఉండాల్సిన కుమారుడు అనంత లోకాలకు

### కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు

**బి కొత్తకోట ఏప్రిల్ 1. ప్రభాతవార్త :**



అవసాన దశలో అండగా ఉండి పోషిస్తాడనుకున్న కన్న కొడుకు కళ్ళెదుటే అనంత లోకాలకు తరలి వెళ్లిన విషాదకర సంఘటన బి కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. బి కొత్తకోట మండలంలోని మొగసాల మర్రికి చెందిన సుబ్బారెడ్డి కొడుకు శ్యాంరెడ్డి (23) బి.టెక్ వరకు చదువుకుని ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఎందుకు చిన్న మనసు చేసుకున్నాడో ఏమో తెలియదు. తాను ఉంటున్న ఇంటిలోనే తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. తల్లిదండ్రులు గమనించి వెంటనే ఉరి నుంచి తప్పించారు. కొన ఊపిరితో ఉన్న కొడుకును చికిత్సల నిమిత్తం హుటా హుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి చికిత్సలు అందించే లోపే శ్యామ్ రెడ్డి మరణించాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి, జిల్లా ఆస్పత్రి పోలీసులు బి కొత్తకోట పోలీసులకు సమాచారం అందించడంతో వారు కేసు దర్యాప్తు చేపట్టారు. శ్యామ్ రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. మా బిడ్డ మమ్మల్ని ఉద్ధరిస్తాడనుకుంటే దేవుడు ఇలా మాకు దూరం చేసి కడుపుకోత మిగిల్చాడని తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించడం ప్రతి ఒక్కరిని కంట కన్నీరు పెట్టించింది. ఆ తల్లిదండ్రుల రోదనను ఆపడం ఎవవరం కాలేదు.

# చంద్రబాబు ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాటమాడడం దురదృష్టకరం

**వేంపల్లె ఏప్రిల్ 01 (ప్రభాత వార్త)**

చంద్రబాబు ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాటమాడడం దురదృష్టకరమని, చంద్రబాబు పాలనలో ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీగా మారిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించాలన్న బృహత్తర లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2007 ఏప్రిల్ 1న నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించారని తులసి రెడ్డి గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా కొన్ని లక్షల మంది పునర్జన్మ ఎత్తారు. చావు అంచులకు పోయి ప్రాణాలతో తిరిగివచ్చారు. ఇది నిజమైన సంజీవని పథకం అన్నారు. దురదృష్టవశాత్తు వైకాపా, కూటమి పాలనలో ఈ పథకం నిర్వీర్యమైందని,అనారోగ్యశ్రీగా మారిందని తులసి రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 2300 నెట్వర్క్ హాస్పిటల్స్ ఉన్నాయి . కూటమి 22 నెలల పాలనా కాలములో నెట్వర్క్ హాస్పిటల్స్ మూడుసార్లు సమ్మె బాట పట్టడం శోచనీయం.దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడమే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకం కింద నెట్వర్క్ హాస్పిటల్స్ కు రాష్ట్ర ప్రభుత్వం 3000 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలి. అవి చెల్లించని కారణంగా నెట్వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలు డాక్టర్లకు, నర్సులకు,మిగతా సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నారు. మందులు కొనుగోలు చేయలేకపోతున్నారు. కరెంటు చార్జీలు కట్టలేకపోతున్నారు. ఆస్పత్రి నిర్వహణ భారమైంది. దీనికి తోడు వివిధ చికిత్స ప్యాకేజీల ధరలు ఐదు సంవత్సరాలుగా పెంచలేదు. అందువలన ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వహించలేమని ఈరోజు నుంచి నెట్వర్క్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీని బంద్ చేశాయి చంద్రబాబు ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉంది.ఆరోగ్యశ్రీ సేవలు అందక కొంతమంది చనిపోయే ప్రమాదం ఉంది.ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్పెషలిస్ట్ హాస్పిటల్స్ అసోసియేషన్ అనగా ఆశా సభ్యులతో మాట్లాడి పెండింగ్ బకాయిలు రు 3000 కోట్లు చెల్లించి, చికిత్స ప్యాకేజీ ధరలు 30 శాతం పెంచి వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.



## కౌమార దశలో గర్భధారణతో సమస్యలు తప్పవు



బద్వేలు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :
కౌమార దశలో గర్భం ధరిస్తే సమస్యలు తప్పవని గోపవరం మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గోపవరం మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కౌమర దశలో గర్భధారణ దుష్ప్రభావాలపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇలా గర్భధారణ కావడంతో పుట్టబోయే బిడ్డకు పోషకాహార లోపం ఉంటుందని, తల్లి బిడ్డ ఇద్దరు ఆనారోగ్యపాలవుతారని సూచించారు. అలాగే బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించాలని తెలిపారు. ఇందుకు ముఖ్యంగా మహిళల తల్లిదండ్రులలో చైతన్యం రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ గౌస్, డిప్యూటి ఎంపీడీవో హసీనా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ద్వజా ప్రతిష్ట కుంభాబిషేకం మహోత్సవం..



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 01 ప్రభాతవార్త
మండలంలోని రేకులకుంట పంచాయతీలోని డి.అగ్రహారంలో జరుగుతున్న శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామ స్వామి దేవస్థానమునందు శ్రీ గణపతి,సుబ్రహ్మణ్య సహిత నూతన ధ్వజ ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు చదిపి రాళ్ళ భూపేశ్ రెడ్డి, ఈశ్వరి దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివ కుమార్ స్వామి, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, శ్రీయపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ యల్లటూరు సాంబశివారెడ్డి కి పూజలు కార్యక్రమాలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనాల మల్లికార్జున రెడ్డి నిర్వహించారు. ఈ ప్రతిష్ట కు మాజీ మండల అధ్యక్షుడు మాలేపాటి సుబ్బారావు,పూజ శివయ్య యాదవ్, శీలం నరసింహులు గౌడ్, అవుల దస్తగిరి,పురుషోత్తం రెడ్డి, రెడ్ల దీన్నె నాగ ఖాదర్, సురేంద్ర, పుటాల శివ,టీడీపీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తది తరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యేచే వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

చాపాడు. ఏప్రిల్1.ప్రభాతవార్త :
మండలంలోని బద్రిపల్లె గ్రామపంచాయతీ నందు నేడు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతులమీదుగా 6 లక్షలుజిల్లాపరిషత్ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్,20లక్షలుఉపాధి హామీనిధులతో చేపట్టిన స్మశానవాటిక ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు గ్రామ సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, టిడిపి నాయకుడు గుత్తి వీరనారాయణ యాదవ్ తెలిపారు.

## సీఎంకు స్వాగతం పలుకుతున్న....









# నిరాశ్రయులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 01 ప్రభాతవార్త :
ఫిబ్రవరి మాసంలో వృద్ధాప్యంలో కూడా వీడని అన్న చెల్లెల అనుబంధం. అనేటువంటి కథనం సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లడంతో వారు చేసినటువంటి ట్వీట్ ద్వారా కలెక్టర్ జిల్లా యంత్రాంగం స్పందించి గోపవరం మండలం పిపి కుంట గ్రామంలోని ఇద్దరు నిరాశ్రయులను ఆర్డిఓ చంద్రమోహన్ మరియు డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో లక్కీ కొండయ్య మరియు ఆయన సోదరి పొంత గిరి లక్ష్మీనారాయణమ్మగా గుర్తించారు. బద్వేల్ పట్టణంలోని మెప్మా మరియు బద్వేల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నైట్ షెల్టర్, ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహం. నకు తరలించి, వారికి అవసరమైనటువంటి వసతులను ఏర్పాటు చేసి, డాక్టర్ల ద్వారా వైద్యం అందించడం జరిగింది. అధికారులు స్వయంగా వారి చేతుల మీదుగా వారికి కొంత ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. ఆర్డీవో, డిఆర్డిఎ పిడి రాజ్యలక్ష్మి ఆదేశాలతో, వారిని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించుకొని, వారికి అవసరమైనటువంటి వైద్యము, వసతి, ఆహారాన్ని, ఈ రెండు నెలలపాటు అందించడం జరిగింది. అధికారుల సహకారంతో, వారికి అవసరమైన రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, మంజూరు చేశారు. నేడు మార్చి ఒకటో



తారీకు ఉదయం, పెన్షన్ వారికి ఇవ్వడంతో ఆనంద నిలయంలోని వృద్ధులు అందరు కూడా తమ యొక్క ఆనందాన్ని సంతోషాన్ని, తెలియపరుస్తూ, వచ్చినటువంటి అధికారులకు కృతజ్ఞతలతో చిరు సన్మానం చేయడం జరిగింది. ఆనంద నిలయం నిర్వాహకులు పిడతల రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపవరం మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ బ్యాంక్ చైర్మన్ పరామర్శ

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త



బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలం కాలవపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాదిరెడ్డి వీరా రెడ్డి సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. ఓబులాపురం రాజశేఖర్, చెరుకూరి రవి కుమార్, అరవ శ్రీనివాసుల రెడ్డి, కొంకుల రాంబాబు, పల్లె రమేష్ రెడ్డి, మాచుపల్లి కృష్ణారెడ్డి, బిజీవేముల చంద్రశేఖర్ రెడ్డి, బైసాని శివరామి రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బద్వేలు అర్బన్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త
బద్వేల్ నెల్లూరు రోడ్‌లోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో పవన్ అకాడమీ హ్యాండ్‌రైటింగ్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించబడినవి. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన పాఠశాల గౌరవ సలహాదారు రామ్మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ కాక సుబ్రమణ్యం యాదవ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందిస్తూ, చదువుల్లోనూ ఇతర పోటీల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అలవర్చుకొని తల్లిదండ్రులు, గురువులు మరియు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని, దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.



### ఏపికి శాశ్వత రాజధానిగా

## అమరావతికి పార్లమెంటు ఆమోదం అభినందనీయం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్‌ను శాశ్వత రాజధానిగా పార్లమెంటు ఆమోదం తెలపడం అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఏర్పాటు చేసే క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసి అమరావతి రాజధాని గా ప్రతిపాదించి కొన్ని రకాల పనులు కూడా నిర్వహిస్తే, అనంతరం 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేశారని వివరించారు. ప్రస్తుతం మార్చి 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అమరావతి ఏకైక రాజధాని అంటూ తీర్మానం చేసి పార్లమెంటు కు పంపామని తెలిపారు. పార్లమెంటు లో బిల్లు పాస్ అయితే ఇక ఏపీకి అమరావతే ఏకైక, శాశ్వత రాజధాని అని వివరించారు. అదేవిధంగా ప్రొద్దుటూరు నియోజకవర్గం లో వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణ కోసం జల్ జీవన్ మిషన్ క్రింద ఆరున్నర కోటి రూపాయల నిధులతో గోపవరం, అమృత్ నగర్, టీచర్స్ కాలనీ, వివేకానంద నగర్, ఏర్వ పాలెం, కొర్రపాడు ప్రాంతాలలో త్రాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడ



తామని వివరించారు. ఇందుకు గానూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, జిల్లా టిడిపి కార్యదర్శి తలారి పుల్లయ్య, జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలి శ్రీనివాసుల రెడ్డి, టిడిపి నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, పల్లా శంకర నారాయణ, నంద్యాల హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివ ధనుర్బా లంకరణ సుందర రూపుడైన శ్రీరామచంద్రుడు



ఒంటిమిట్ట ఏప్రిల్.01 ప్రభాతవార్త
తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ అయోధ్యగా పేరుపొందిన ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం శివ ధనుర్బాలంకరణ వేషధారణలో సుందరవదనంగా ప్రత్యేకమైన అలంకారంలో పల్లకీపై ఆశీనులై గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులకు దర్శన భాగ్యాలు కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు శ్రీ రామ ఉత్సవ వరునుకు శివధనుర్భణలంకరణ సహితంగా తీర్చిదిద్ది పల్లకి పై ఆశీనులను గావించి ఒంటిమిట్ట పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మాడు వీధుల గుండా కళ్యాణ రాముని ఉత్సవం నభూతో నభవిష్యత్తుగా సాగింది. వేదమంత్రాల మంగళ వాయిద్యాల ,కేరళ వాయిద్య నృత్య ప్రదర్శనల మహిళల, చిన్నారుల కోలాటాల, చెక్కభజనల, రామ కీర్తనల నడుమ నానా వస్త్రాలంకరణ రూప దారుడై శివ ధనుర్భాలంకరణలో జగదభిరాముడు ఉత్సవంలో సంచరిస్తుండగా పురవీధులు కళకళలాడుతుండగా ప్రజలు అత్యంత భక్తితో యధాశక్తిగా తమ మొక్కులు తీర్చుకున్నారు. అడుగడుగునా భక్తులు నీరాజనాలు పట్టడం జరిగింది. నీల నీలమేఘ శ్యాముని గ్రామోత్సవంలో కోలాటాలు ,చెక్కభజనలు, కేరళ వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు తారా స్థాయికి చేరాయి. భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సీతామాత స్వయంవర సమయంలో శ్రీరాముడు శివ ధనుస్సు ఎక్కుపెట్టి విరిచి సీతమ్మ తల్లిని పరిణయమాడే ఘట్టాన్ని తెలియజేస్తుంది. శ్రీ సీతారామ కళ్యాణోత్సవం సమయంలో శ్రీరామచంద్రుడు శివ ధనుర్భాణాలంకరణంలో ఒంటిమిట్ట పుర ప్రజలకు దర్శనమిస్తున్నాడు .ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీవో ప్రశాంతి, ఆలయ సూపర్డెంట్ హనుమంతయ్య, ఇన్స్పెక్టర్ నవీన్ తదితరులు ఉన్నారు.





# శ్రీ సీతారాముల కల్యాణంలో భక్తజన సందోహం

- దాదాపు 80 వేల మంది భక్తులు
- టీటీడీ-ప్రభుత్వ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు
- సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసిన రామభక్తులు
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

రాజంపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో దాదాపు 80 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి దివ్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. టీటీడీకి చెందిన అన్ని విభాగాలు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశాయి. ఈ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.కల్యాణ వేదిక ప్రాంగణంలో విశాలమైన 121 గ్యాలరీలను ఏర్పాటు చేసి, భక్తులు సౌకర్యవంతంగా కూర్చుని కల్యాణోత్సవాన్ని వీక్షించేలా చర్యలు తీసుకున్నారు. కల్యాణానికి విచ్చేసిన ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణాలను టీటీడీ అందించింది.ప్రతి భక్తుడికి లెమన్ రైస్, కేసరి, బిస్కెట్ ప్యాకెట్, మ్యాంగో జ్యూస్, వాటర్ బాటిల్, స్వీట్, కారా పదార్థాలతో కూడిన కిట్‌ను అందజేశారు. గ్యాలరీలలో భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరం మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు పంపిణీ చేశారు.నడిచి వచ్చే భక్తుల కోసం 11 ప్రాంతాల్లో, ఆలయ సమీపంలో 3 వేల మంది భక్తులు వేచి ఉండేలా ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశారు. పానకం, మజ్జిగ, చలివేంద్రాలు, వాటర్ కూలర్లు, సిబ్బంది అందుబాటులో ఉంచారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు 21 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాల నుండి కల్యాణ వేదిక వరకు టీటీడీ 20 ఉచిత బస్సులను నడిపింది.భక్తుల ఆరోగ్య పరిరక్షణకు 13 వైద్య శిబిరాలు, 35 మంది వైద్య నిపుణులు, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 8 అంబులెన్సులు సిద్ధంగా ఉంచి అవసరమైన వైద్యసేవలు అందించారు.పారిశుద్ధ్య పరిరక్షణలో భాగంగా 250 మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, 3,268 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించారు. 2,600 మంది శ్రీవారి సేవకులు, ప్రభుత్వ, పోలీస్, టీటీడీ సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని ఎస్వీబీసీ ద్వారా హెచ్‌డీ నాణ్యతతో ప్రసారం చేయగా, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు వీక్షించి ఆధ్యాత్మికానందాన్ని పొందారు.



## కూటమి నాయకుల సహకారంతో బస్టాండ్ వద్ద చలివేంద్రం ప్రారంభం

పులివెందుల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :
వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పులివెందుల పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని బస్టాండ్ వద్ద కూటమి నాయకులు చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆదేశాల మేరకు ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ చలివేంద్రాన్ని కూటమి నాయకులు అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, నల్లా భాస్కర్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, మండల వైస్ ఎంపీపీ విశ్వనాథ రెడ్డి, ఖాసీం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు మరియు బాటసారులు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌కు వచ్చే పేద ప్రజలు, ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజా సేవలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ఈ ఏర్పాట్లను ముందుగా పరిశీలించి తాగునీటి సౌకర్యం పై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించే ఈ చలివేంద్రాన్ని అందరూ వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

### తైక్వాండో పోటీలలో వైయస్ఆర్

## ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ప్రతిభ



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త
మార్చి 31 తేదీన యోగి వేమన యూనివర్సిటీ కడపలో జరిగిన టైక్వాండో పోటీలలో 65కేజీ బాలుర విభాగంలో వైయస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొద్దుటూరు విద్యార్థి (ఇఇఇ 3వ ) చదువుతున్న డి అబ్దుల్ అనే విద్యార్థి యూనివర్సిటీ లెవెల్లో గోల్డ్ మెడల్ సాధించి కాలేజీ కి జిల్లాలో మంచి పేరు తేవడం ఆనందించదగిన విషయమని కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య జయచంద్ర రెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, విద్యార్థినిలు చదువులతో పాటు క్రీడలలో కూడా మంచి ప్రతిభ కనపరచాలని అలాగే ప్రతిరోజూ ఉండే స్పోర్ట్స్ హౌర్స్ లో ఆటలు ఆడుతుంటే మంచి ఆరోగ్యంతో పాటు శరీర పుష్టి కలిగి ఎంతో హుషారుగా ఉంటారని, అలాగే క్రీడలలో కనపరిచే ప్రతిభ భవిషత్తులో మీకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కనుకు ప్రతిఒక్కరు ఆటలు ఆడుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. గోల్డ్ మెడల్ సాధించినా విద్యార్థిని కళాశాల డీన్ అఫ్ ఇంజనీరింగ్ ఆచార్య నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య రమణయ్య, బోధన బోధనతేర స్టాఫ్ మరియు విద్యార్థి, విద్యార్థినిలు అభినందించారు.

## నీటి సమస్యకు పరిష్కారం

పులివెందుల, ఏప్రిల్ 1 , ప్రభాతవార్త :



నియోజక వర్గ పరిధిలోని వేంపల్లె మండలంలోని ముసల్ రెడ్డి గారి పల్లె గ్రామంలో నెలకొన్న తీవ్రమైన సాగు మరియు తాగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనున్నది. గ్రామానికి చెందిన కూటమి నాయకులు, ప్రజలు ఈరోజు పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో వేంపల్లె టీడీపీ ఇన్చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి లను కలిసి తమ సమస్యలను వివరించారు. నీటి కొరత కారణంగా వ్యవసాయం దెబ్బతింటోందని, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు విన్నవించారు. ఈ నేపథ్యంలో నాయకులు సానుకూలంగా స్పందించి, సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేపటి నుంచే గ్రామానికి నీటిని విడుదల చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాయకుల స్పందనపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ చర్యతో గ్రామంలో సాగు మరియు తాగునీటి సమస్యలు కొంతవరకు తగ్గుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.